# ప్లానింగ్

-భమిడిపాటి సోమయాజి

ఆ రోజు ఆగస్టు 31వ తేదీ. సౌజన్యరావు రిటైర్‌మెంట్ రోజు. సాయంకాలం ఆఫీసులో పార్టీ ఇచ్చారు, పూలదండలు వేసారు. ఒక జ్ఞాపికను బహూకరించారు. చాలామంది పొగుడుతూ మాట్లాడారు. అతను వాటికి అర్హుడే. ఆఫీసులోనే కాదు, ఇంట్లోనే కాదు, ఎక్కడైనా ఒక పద్ధతి ప్రకారం నడుచుకునే మనిషతను. ఇంటిదాకా వచ్చిన అతని ఆఫీసు వాళ్ళు కాసేపు కూర్చుని తిరిగి కారులో వెళ్లిపోయారు.

ఇంట్లో ఇద్దరు కొడుకులు, కోడళ్లు, కూతురు, అల్లుడు అందరూ అతని సుఖమయ జీవితానికి శుభాకాంక్షలు చెప్పారు. రాత్రి పడుకునే ముందు సౌజన్యరావు భార్య చెప్పింది 'మనవల పేరున ఒక్కొక్కరికి పదివేలు వేయమని, కూతురికి ఏభైవేలు ఇవ్వమని, కోడళ్లిద్దరికీ రెండేసి జతల గాజులు చేయించమని.'

మనసులోనే లెక్క వేసుకున్నాడు వీటికెంతవుతుందో! ఎనభై వేలదాకా అయ్యేట్టుంది. కూతురి పెళ్లికి చేసిన అప్పు ఇంకా డెభ్భై అయిదువేలు వుంటుంది. తనకి వచ్చిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అంతా కలిపి అయిదులక్షలు. ఇంకా కనీసం రెండు రూముల ఫ్లాట్ దూరంలోనైనా కొనమంటున్నారు. ఇవన్నీ ఎలా చేయాలో అర్థం కావడంలేదతనికి.

"సరే చూద్దాం. పడుకో" అన్నాడు భార్యతో.

★★★

పొద్దునే పెద్దకొడుకు సౌజన్యరావుతో అన్నాడు "నాన్నగారూ! నేను కాలేజీలో చదువుకునే రోజు నుంచీ మిమ్మల్ని అడుగుతున్నాను ఒక స్కూటర్ కొనివ్వమని. మీకు వీలైతే ఆ కోరిక తీర్చండి" అన్నాడు.

మధ్యాహ్నం కొడుకులు ఆఫీస్‌కెళ్లిన తరువాత సౌజన్యరావు భార్యతో అన్నాడు "పెద్దాడు స్కూటర్ కొనివ్వమని అడిగాడు. నువ్వు కొన్ని చెప్పావు. మరి ఇవన్నీ చేస్తే ఒక సొంత ఇల్లు కావాలంటే ఎలా?"

తల్లి మనసు! పాపం పిల్లలడిగింది వద్దని ఎలా చెబుతుందావిడ.

"పెద్దాడు ఎప్పట్నుంచో ముచ్చట పడుతున్నాడు స్కూటర్ గురించి. కోడలికి కూడా స్కూటర్ మీద భర్తతో వెళ్లడమంటే సరదా అనుకుంటాను. పోన్లెండి. పిల్లల సరదాలు మనం కాకపోతే ఎవరు తీరుస్తారు. వాడి ముచ్చట తీర్చండి" అందావిడ.

"అది సరే. పెద్దాడికి ఇస్తే చిన్నాడు ఏమనుకుంటాడో! వాడి ఉద్దేశ్యం ఏమిటో మెల్లగా కనుక్కో" అన్నాడు సౌజన్యరావు.

సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చిన చిన్న కొడుకుని పిలిచి స్కూటర్ ప్రస్తావన చేసింది తల్లి.

రెండో కోడలు పెద్ద పనున్నట్లు వచ్చి "రాత్రి మీరూ మామయ్యగారు భోజనం చేస్తారా, లేకపోతే చపాతీలు చేయనా?" అని అడిగింది.

"ఏదో ఒకటి చేయి. రాత్రి భోజనం చేయం" అని చెప్పి కోడల్ని పంపేసింది.

"నాకు కూడా స్కూటర్ కావాలమ్మా. ఈ బస్సుల్లో వెళ్లాలంటే చాలా కష్టంగా వుంది. పైగా మా ఆఫీసర్ కొత్తగా వచ్చాడు. చాలా స్ట్రిక్ట్" అని అన్నాడు.

పైగా తను చెల్లెలు పెళ్లికి పాతికవేలు ఫ్రెండ్ దగ్గర తెచ్చి ఇచ్చాననీ, అందులో కనీసం పదిహేను వేలైనా తీర్చేయాలని చెప్పాడు.

భార్య ఈ విషయాలన్నీ సౌజన్యరావుతో చెప్పింది. బాగానే వుందనుకున్నాడు. ఏదో ఒకటి జరుగుతుంది భగవంతుడే వున్నాడు కానీ... అని రెండు స్కూటర్లు కొనివ్వడానికే నిర్ణయించుకున్నాడు. రిటైర్‌మెంట్‌కి వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చి అప్పులవాళ్లచేత 'శభాష్' అనిపించుకున్నాడు. కొడుకులు, కోడళ్ళ సరదాలు తీర్చి వాళ్ల చేత 'భేష్' అనిపించుకున్నాడు. కూతురికి ఏభైవేలిచ్చి అల్లుడిచేత 'భళారే మామా' అనిపించుకున్నాడు సౌజన్యరావు. ఇంకా రెండున్నర లక్షలే మిగిలాయి. సౌజన్యరావు గుండె గుభిల్లుమంది.

పదిహేనురోజుల తరువాత ఆ ఫ్లాట్ విషయం ఏమి చేసారని కొడుకులు తండ్రిని అడిగారు. ప్లాటూ లేదు, ఫ్లాటూ లేదు అని గట్టిగా చెబుదామనుకున్నాడు. కానీ పిల్లలు బాధపడతారని అనలేదు.

చిన్నకోడలు పెద్దకోడలితో అంది "అక్కయ్యా! అప్పుడే కార్తీకమాసం వచ్చేసింది. ఈ కార్తీక దీపాలుండగానే మన ఇళ్ళు చక్కబెట్టుకోవాలి"

"ఇళ్ళు అంటున్నావు. మనకి ఉండేది ఈ అద్దె ఇల్లు ఒక్కటే కదా" అంది పెద్దకోడలు.

"అంటే ఎప్పుడూ ఈ ముసలాళ్లతోనే వుంటావా నువ్వు? నీకు తెలుసో తెలియదో మామయ్యగారి దగ్గరున్నది అక్షరాలా రెండున్నర లక్షలు మాత్రమే" అంది చిన్నకోడలు.

"అందుకే మా అమ్మ మొన్న నేను పుట్టింటికి వెళ్లినప్పుడు చెప్పింది "అమ్మాయ్! నీకేం తెలీదు. కనీసం నీ తోడికోడలు మాట విను బాగుపడతావు" అంది పెద్దకోడలు.

పొంగిపోతూ అంది చిన్న కోడలు "ఈ కార్తీక మాసం మామగారు, అత్తగారు కూడా సోమవారం ఉపవాసాలు ఉంటారు. తెల్లారకట్ల గుడికి కూడా వెళ్తారు. మనం కూడా వాళ్లతో కూడా శివాలయానికి వెళ్లి ఆ గుళ్ళో వాళ్లతోపాటు ప్రదక్షిణాలు చేసి ఆఖరి సోమవారం వాళ్లు నీరసంగా వున్నప్పుడు కనీసం ఒక్కొక్కళ్ళు డెభ్భై అయిదువేలదాకా పట్టేద్దాం" అంది చిన్నకోడలు.

అనుకున్నట్లుగానే కోడళ్ళు, కొడుకుల మద్దతుతో ఒక లక్షా ఏభైవేలదాకా పట్టేసారు. ఇంక ఒక లక్ష మాత్రమే మిగిలింది. ధనుర్మాసం వచ్చేసింది. ఇంక మిగిలిన డబ్బు గుర్తొచ్చినప్పుడల్లా సౌజన్యరావు గుండె ధన్‌మని కొట్టుకుంటోంది.

"మనకి ఏమైనా అనారోగ్యం చేస్తే మన దగ్గర తగినంత డబ్బు కూడా లేదు. మళ్ళీ ఏదైనా ఉద్యోగం చేయమంటావా?" అని పిల్లలకి వినబడేటట్లు భార్యతో అన్నాడు సౌజన్యరావు వాళ్ళేమంటారో చూద్దామని.

"ఇంకా ఉద్యోగమేం చేస్తారు. మగపిల్లలు మనల్ని చూస్తారులెండి. మనం ఎప్పుడూ వాళ్లకి ఏ లోటూ చేయలేదుకదా. కోడళ్ళు కూడా మీరు రిటైర్ అయిన తరువాత ఇంకా జాగ్రత్తగా చూస్తున్నారు" అంది సౌజన్యరావు భార్య.

ఒకసారి చిన్నకోడలు మామగారితో అంది "మామయ్యగారూ! మీరేమీ అనుకోనంటే ఒక చిన్న కోరిక"

"ఏమిటమ్మా చెప్పు" అన్నాడు సౌజన్యరావు.

"మా చెల్లెలి పెళ్లి కుదిరింది. కట్నం లక్షా డెభ్భై వేలు. పైన ఒక లక్ష పెళ్లి ఖర్చు అవుతుందనుకుంటాను. ఒక పాతికవేలు మీరు సర్దగలరేమోనని అడగమన్నారు మా నాన్నగారు" అంది.

సహజంగా సహాయపడే గుణమున్న సౌజన్యరావుకి పెళ్లి అంటే ఎంత కష్టమో కూడా తెలుసు. అందుకే "ఒక నోటు నీ పేరున తీసుకుని ఇద్దాం. ఆడపిల్ల సొమ్ము పుట్టింటివాళ్ళు ఎప్పటికైనా ఇచ్చే

స్తార్లే" అన్నాడు సౌజన్యరావు.

"అలాగే కానీండి" అంటూ ఒక పాతికవేలు పట్టేసింది చిన్నకోడలు.

తరువాత ఆర్నెల్లకి పెద్దబ్బాయి తన కొడుకుని మంచి కాన్వెంట్‌లో వేయడానికి ఇరవై వేలు ఇమ్మని అడిగాడు. వాడు మొదటి మనవడు. కాదని ఎలా అనగలడు? ఆ డబ్బు కూడా సర్దుబాటు చేసాడు సౌజన్యరావు. ఇంక బ్యాంక్ బ్యాలెన్స్ ఏభై అయిదువేలే వుంది. ఎప్పటికప్పుడు బ్యాలన్స్‌షీట్ తయారుచేస్తూనే వున్నారు ఇంట్లో వాళ్ళు. చిన్న కోడలు సలహా మేరకు తన రెండో కొడుకు ఇంకో రాష్ట్రానికి బదిలీ చేయించుకుని వెళ్లిపోయాడు. వెంటనే బదిలీ చేయించుకుని వెళ్లిపోతే బాగుండదని కొంతకాలం తరువాత పెద్దవాడు కూడా ఇంకో రాష్ట్రానికి బదిలీ చేయించుకున్నాడు.

ఆఖరికి ఇద్దరు ముసలాళ్ళూ, ఆ కాస్త బ్యాంక్ బ్యాలెన్స్‌తో ఆ ఊళ్ళో మిగిలారు.

ఒకరోజు సౌజన్యరావు భార్య అంది "పిల్లలు మన దగ్గర లేకుండా వెళ్లిపోయారు. మళ్లీ మనమిద్దరమే మిగిలాం"

"రెక్కలు వచ్చిన పక్షులు గూట్లోంచి ఎగిరిపోతాయి. అందులోనూ అవి జంట పక్షులు కూడాను. ఇటువంటి పరిస్థితులు వచ్చిన తరువాత నువ్వేమైనా ఇబ్బంది పడతావేమో అని కొంత డబ్బు ఆఫీసులో జీతం బకాయిలు వచ్చినప్పుడు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తచేసాను. పిల్ల పెళ్లికి అవసరమైనా ఆ డబ్బు తీయలేదు. విడిగా అప్పు చేసాను. రెండునెలల్లో నాలుగులక్షలదాకా మొత్తం డిపాజిట్ చేతికి అందుతుంది. ఆ డబ్బు నీ పేరున వేస్తాను. నెలనెలా వడ్డీ వస్తుంది. ప్రపంచంలో ఎంతోమంది ముసలివాళ్లను చూస్తున్నాం పిల్లలుండి కూడా ఆసరా లేకుండా బ్రతుకుతున్నవాళ్లని. ఇప్పుడర్థమయిందా నువ్వు చెప్పినట్లే ఆ డబ్బు ఎందుకు ఖర్చు పెట్టేశానో" అన్నాడు సౌజన్యరావు.

కళ్లల్లో నీళ్ళు తిరిగిన సౌజన్యరావు భార్య అతన్ని స్పష్టంగా చూడలేక తన మనస్సులోనే చూసుకుంటూ దండం పెట్టుకుంది.

★

